క్లుప్తంగా

చంద్రమౌళికి ఘన నివాళి



గోపాలపట్నం బంక్ వద్ద నివాళులర్పిస్తున్న పారిశుధ్య కార్మికులు, అధికారులు

గోపాలపట్నం: ఉగ్రదాడిలో మృతి చెందిన విశాఖ వాసి చంద్రమౌళికి జీవీఎంసీ 92వ వార్డు పారిశుధ్య కార్మికులు శనివారం ఘన నివాళులర్పించారు. గోపాలపట్నం బంక్ వద్ద చంద్రమౌళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఉగ్రవాదుల దాడిని ఖండించారు. నల్ల రిబ్బన్లు ధరించి బంక్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి, సచివాలయ కార్యదర్శులు, అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్లు దమ్ము శ్రీను, బీవీరమణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్ యాదవ్‌కు అభినందనలు



డాక్టర్ చంద్రశేఖర్‌యాదవ్‌ను అభినందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీగా ఇటీవల నియమితులైన డాక్టర్ పి.చంద్రశేఖర్ యాదవ్‌కు బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. శనివారం విశాఖ వచ్చిన ఆయనను సంఘం జిల్లా అధ్యక్షుడు నక్కెళ్ల నర్సింగరావు యాదవ్ తదితరులు ఘనంగా స్వాగతించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

వీధి లైట్ల సమస్యపై సబ్‌స్టేషన్ వద్ద ధర్నా



సబ్‌స్టేషన్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు శాంతిగిరికాలనీలో కొద్దిరోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై అధికారులకు తెలియజేసినా స్పందించకపోవడంతో సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు శ్రీహరిపురం సబ్‌స్టేషన్ వద్ద కాలనీవాసులతో కలిసి శనివారం ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ సుమారు 12వేల మంది నివసిస్తున్న శాంతిగిరి కాలనీలో వీధిలైట్ల సమస్యపై అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం శ్రీహరిపురం సబ్‌స్టేషన్ అధికారికి కాలనీ వాసులతో కలసి వినతిపత్రం అందించారు.

దివ్యాంగులకు పథకాలు అమలు చేయాలి

కలెక్టర్ హరేందిర ప్రసాద్

బీచ్‌రోడ్డు: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్, దివ్యాంగుల పథకాల అమలు ప్రతి శాఖలో నోడల్ అధికారి పర్యవేక్షణలో జరగాలని సూచించారు. దివ్యాంగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలని, వారి హక్కులు, చట్టాలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. దివ్యాంగుల పిల్లలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, వారు అన్ని ప్రదేశాలను సందర్శించేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ మాధవితో పాటు అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వయోవృద్ధుల పోషణ, సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డివిజనల్, మండల స్థాయిలో ప్రత్యేక సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా సీనియర్ సిటిజన్స్ కమిటీ మీటింగ్‌లో కలెక్టర్ మాట్లాడారు.

ప్రభుత్వ నిధులతో ప్రజావసరాల కోసం నిర్మించిన సామాజిక భవనాలపై కూటమి నేతల కన్ను పడింది. ఇన్నాళ్లు కాలనీ అసోషియేషన్ల ఆధ్వర్యంలో నడుస్తున్న కమ్యూనిటీ హాల్స్‌ను కూటమి నేతలు తమ కబంధ హస్తాల్లోకి తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు. వీఎంఆర్డీఏ అధికారులను రంగంలోకి దింపారు. ఒప్పందం ముగిసిందనే కారణం చూపి స్వాధీనం చేసుకోవడానికి సిద్ధమయ్యారు. ఇలాంటి పరిస్థితుల్లో శుభకార్యాలు చేసుకోవడానికి సామాన్యులకు ఆర్థిక భారం కానుంది. గతంలో ఎన్నడూ లేని రీతిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు చూస్తున్న ఆయా కాలనీ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
– విశాఖ విద్య



‘కమ్యూనిటీ’ పై కూటమి పెత్తనం..!

సామాజిక భవనాలతో వ్యాపారం

ధనార్జనే ధ్యేయంగా కూటమి నేతల స్కెచ్

శుభకార్యాలకు తప్పని అదనపు భారం

అసోసియేషన్లకు వీఎంఆర్డీఏ అధికారుల తాఖీదులు

కమ్యూనిటీ హాల్స్ స్వాధీనం చేసుకుంటామని హెచ్చరికలు

మతలబేమిటో!

మద్రిపాలెం వుడా లే అవుట్‌లో ఉన్న సామాజిక భవనం స్వాధీనం చేసుకున్న వీఎంఆర్డీఏ అధికారులు కొన్ని రోజులు వారి ఆధ్వర్యంలోనే ఉంచుకున్నారు. వీఎంఆర్డీఏ సిబ్బందిని ఏర్పాటు చేసి, రోజుకు రూ. 47 వేల చొప్పున అద్దె కూడా నిర్ణయించినట్లుగా తెలిసింది. ఎన్నో ఏళ్లుగా కాలనీ అసోసియేషన్ అజమాయిషీలో ఉన్న కమ్యూనిటీ హాల్‌ను ఉన్న ఫలంగా వీఎంఆర్డీఏ స్వాధీనం చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. అసోసియేషన్లను ఏమాత్రం పట్టించుకోకుండా వీఎంఆర్డీఏ అధికారులు కమ్యూనిటీ హాల్ స్వాధీనం చేసుకోవడం వెనుక దాగి ఉన్న మర్మమేమిటోనని విస్తృత చర్చసాగుతోంది.

ధనార్జనే ధ్యేయమా..?

ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని వీఎంఆర్డీఏ ద్వారా సామాజిక భవనం నిర్మించారు. నామ మాత్రపు అద్దెతో ఆయా ప్రాంతాల వారు వినియోగించుకుంటున్నారు. వాటి నిర్వహణను కాలనీ అసోసియేషన్‌కు దీర్ఘకాలిక ఒప్పందం మేరకు అప్పగించారు. అసోసియేషన్ వారు ఇక్కడ శుభకార్యాలు, లేదా ఇతర ఏమైనా సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు రోజుకు రూ. 40 వేలు వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే కాలనీ లైఫ్ మెంబర్స్‌కు అయితే రూ.18 వేలు, సింగల్ ఫ్లోర్ అయితే రూ.9 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రైవేటు కల్యాణ మండపాల అద్దె రోజుకు లక్షల్లో చెల్లించాల్సి ఉన్నందున, కాలనీలో ఎక్కువ మంది వీఎంఆర్డీఏ సామాజిక భవనాలనే వినియోగించుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. కాలనీ వాసులకు ఉపయోగకరంగా ఉన్న దీన్ని వీఎంఆర్డీఏ స్వాధీనం చేసుకోవడంలో అసోసియేషన్ బాధ్యుల వైఫల్యం కూడా ఉన్నట్లుగా కాలనీలో చర్చసాగుతోంది. ధనార్జనే ధ్యేయంగా జరుగుతోన్న ఇలాంటి పరిణామాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జీవీఎంసీ 52వ వార్డు మద్రిపాలెం వుడాలే అవుట్‌లోని కమ్యూనిటీ భవనాన్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు వీఎంఆర్డీఏ అధికారులు వెల్లడించారు. ఇదొక్కటే కాదు పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న సామాజిక భవనాల స్వాధీనానికి వీఎంఆర్డీఏ అధికారులు నోటీసులు ఇచ్చారు. కమ్యూనిటీ హాల్ నిర్వహణకు వీఎంఆర్డీఏతో చేసుకున్న ఒప్పందం గడువు ఎప్పుడో ముగిసిందని, కాలనీ అసోసియేషన్లు లీజును రెన్యువల్ చేసుకోకపోవడంతో తాము స్వాధీనం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. వెనువెంటనే ఆయా కమ్యూనిటీ హాల్స్ ముందు వీఎంఆర్డీఏ బోర్డులు సైతం పెట్టేశారు. ఎవరైనా వాటిని వినియోగించుకోవాలంటే వీఎంఆర్డీఏ కార్యాలయంలో సంప్రదించాలని ప్రకటించారు.



కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు



కమ్యూనిటీ హాల్ లోపలి వేదిక

కోర్టు మెట్లెక్కిన అసోసియేషన్లు!

మద్రిపాలెం వుడా లే అవుట్‌లో ఉన్న సామాజిక భవనాన్ని వీఎంఆర్డీఏ అధికారులు స్వాధీనం చేసుకోవడంపై దుమారం రేగింది. అసోసియేషన్‌పై పెత్తనం చేస్తున్న వారి వల్లే ఇలా జరుగుతోందని కాలనీలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించే ఓ వర్గం, దీనిపై అందరినీ కూడగట్టి తమ నిరసన గళాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులకు తెలిపేందుకు సమాయత్తమయ్యారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే గణబాబు జోక్యం చేసుకుని మళ్లీ సామాజిక భవనం నిర్వహణ బాధ్యతలను కాలనీ అసోసియేషన్‌కే అప్పగించినట్లుగా చెబుతున్నారు. ఇదిలా ఉండగా, లీజు గడువు ముగిసి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని వీఎంఆర్డీఏ అధికారులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏక పక్షంగా తీసుకున్న నిర్ణయంపై నగరంలోని కొన్ని అసోసియేషన్లు కోర్టును సైతం ఆశ్రయించినట్లుగా తెలుస్తోంది.

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ..



మృతులకు నివాళులర్పిస్తున్న ఇండియన్ నేవీ సివిలియన్ ఉద్యోగులు



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న మాజీ సైనికులు



మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న యువకులు

డాబాగార్డెన్స్: ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం నేవల్ డాక్‌యార్డ్‌లో పెహల్గాం మృతులకు కార్మికులు ఘనంగా నివాళులర్పించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రదాడిలో మృతి చెందిన చంద్రమౌళికి సంతాపం ప్రకటించి కొద్ది సేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పుట్టా విద్యాసాగర్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని కేంద్ర ప్రభుత్వం మట్టుపెట్టాలని డిమాండ్ చేశారు. అమాయక పర్యాటకుల ప్రాణాల్ని తీసిన ఉగ్ర చర్యల్ని బీఎంఎస్ ఖండిస్తుందన్నారు. ఐఎన్‌సీఎంఎస్ మజ్దూర్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్. రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతాడ రమణ, కోశాధికారి పి. సురేష్, అల్లిపిల్లి నరసింహరాజు, పంపా రవికుమార్, యోగిత, జగదీష్, ఎం. శ్రీనివాసరావు, బి. లక్ష్మణరావు, బండారు శివకాశీబాబు, అ.

మాజీ సైనికుల క్యాండిల్ ర్యాలీ

విశాఖ విద్య: జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులను అన్యాయంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని వి.వి.కె.కె.వి.డబ్ల్యూ గౌరవ అధ్యక్షులు కమాండర్, కె.ఎల్.రావు, మేజర్ రావు అన్నారు. పహల్గాం ఘటనపై నిరసన తెలుపుతూ జీవీఎంసీ 90వ వార్డు పరిధిలోని వినోద్ నగర్, విమాన్ నగర్, కాకాని నగర్, కనక మహాలక్ష్మి నగర్, వెటరన్ వెల్ఫేర్ అసోసియేషన్ (మాజీ సైనికులు) ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్ రావు మాట్లాడుతూ ముష్కరులు అమాయకుల ప్రాణాలు బలిగొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి, దేశభద్రతను కాపాడాలని కోరారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి యుగంటేశ్వరరావు, జాయిం

శాంతిర్యాలీ

మల్కాపురం: పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా గాజువాక జింక్ గేటు నుంచి శ్రీహరిపురం వరకు పశ్చిమ నియోజకవర్గ బీజేపీ నాయకులు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జింక్ ఆంజనేయస్వామి ఆలయ కూడలి వద్ద యువకులందరూ కలిసి మానవహారంగా ఏర్పడ్డారు. ఘటనలో మృతులకు ఆత్మశాంతి చేకూరాలని కొన్ని నిమిషాల మౌనం పాటించి, అనంతరం ర్యాలీ కొనసాగించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొలూరి గురుమూర్తి, సతీష్, టీడీపీ నాయకులు హేమారావు, జనసేన నాయకులు శివ, సంతోష్, రాజేష్, పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో లిఖితకు చోటు



లిఖితకు సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బాజీ జంక్షన్ సుసర్ల కాలనీకి చెందిన డెంటల్ విద్యార్థి ఎల్.లిఖత సంగీత వాయిద్య ప్రదర్శన ఉత్తమ ప్రతిభ కనబర్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. విజయవాడ హలెల్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు పాస్టర్ అగస్టిన్ దండిగి ఆధ్వర్యంలో గతేడాది డిసెంబరు1న ప్రపంచంలోని 18 దేశాలకు చెందిన 1,046 మంది విద్యార్థులు గంట వ్యవధిలో ఆన్‌లైన్ విధానంలో కీ బోర్డు ప్రదర్శనలో పాల్గొనగా అది గిన్నిస్ రికార్డులో చేరింది. కీబోర్డ్ ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఎల్.లిఖత గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించింది. శుక్రవారం రాత్రి విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మెడల్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు లిఖతను అభినందించారు.

20న బంగారమ్మ అమ్మవారి పండగ



ప్రచార కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ పెద్దలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90 వ వార్డు బుచ్చిరాజుపాలెం గ్రామ ప్రజల ఇలవేల్పు, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి బంగారమ్మ పండగను త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో మే 20న అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు ఎలమంచిలి చంద్రరావు తెలిపారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో శనివారం ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించి పండగ వివరాలు వెల్లడించారు. మే 11న పండగ చాటింపు, అదే రోజు నుంచి ప్రతిరోజు సాయంత్రం ఘటాల ఊరేగింపు ఉంటుంది. 19 న తొళ్లే ఉత్సవం, 20 న అమ్మవారి ప్రధాన పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. వేకువ జాము నుంచే అమ్మవార్లకు పంచామృతాభిషేకం తదుపరి విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. విద్యుత్ అలంకరణతో భారీ స్టేజీలు ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో త్రివేణి గ్రామ అభ్యుదయ సేవా సంఘం గౌరవ అధ్యక్షుడు పురెడ్డి గురు రామిరెడ్డి, కార్యదర్శి గొందేశి రాము, కోశాధికారి దొడ్డి జగదీశ్వర రావు, ఉపాధ్యక్షుడు మళ్ల కనకరాజు, కమిటీ సభ్యులు దొడ్డి కనకరాజు(కన్నా), దొడ్డి సతీష్, శరగడం అరుణ్ కుమార్, నైదానం గోపి, నమ్మి రాజు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి తదితరులు పాల్గొన్నారు

కబ్జా ‘బోరు’ స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..



కబ్జా చేసిన బోరును స్వాధీనం చేసుకుంటున్న మంచినీటి విభాగాధికారులు, సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దయానందనగర్ ముత్యమాంబకాలనీలో జీవీఎంసీ మంచినీటి బోరు నుంచి టీడీపీ సీనియర్ నాయకుడు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మంచినీరు చోరీ చేస్తూ భారీ మొత్తంలో వ్యాపారం చేస్తున్నాడు. ముత్యమాంబ కాలనీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను అర్హులైన వార్డు ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలతో అందించారు. మంచినీటి బోర్లు, సంపులు, వాటర్ ట్యాంకులు నిర్మించి మంచినీటి సమస్య లేకుండా చూశారు. అంతవరకు బాగానే ఉన్నా... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వార్డులో టీడీపీ నాయకుల హవా మితిమీరి ప్రజలకు అందాల్సిన మంచినీటిని చోరీ చేస్తున్నారు. సమస్య పై ఈ నెల 25న సాక్షి దినపత్రిక ‘నీటి చోరీ!’ అనే కథనం వెలువడింది. స్పందించిన జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశాల మేరకు మంచినీటి విభాగం ఏఈ సుమన్ నేతృత్వంలో సిబ్బంది కబ్జా చేసిన మంచినీటి బోరును సీజ్ చేశారు. ముత్యమాంబ కాలనీ ప్రజల అవసర నిమిత్తం అందుబాటులోకి బోరుకు పైపు కనెక్షన్ ఇవ్వనున్నట్లు ఏఈ సుమన్ తెలిపారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండర్ అజతుల్లా ఖాన్

కంచరపాలెం: నేవల్ డాక్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్మికులు, ఉద్యోగులు 134 యూనిట్ల రక్తం అందించి ఆదర్శంగా నిలిచారు. కంచరపాలెం దరి మేగాద్రిపేట రెసిడెన్షియల్ కాలనీలోని ఓ ఆడిటోరియంలో శనివారం డాక్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కార్మిక ఉద్యోగుల అప్ లిఫ్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి డాక్‌యార్డ్ జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్ కమాండర్ అజతుల్లా ఖాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సరైన సమయానికి రక్తం అందక అనేకమంది మృత్యువాత పడుతున్నారన్నారు. అటువంటి సందర్భం రాకుండా ఉండాలని సామాజిక స్ఫూహతో రక్తదాన శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అప్ లిఫ్ట్ అసోసియేషన్ అధ్యక్ష-కార్యదర్శులు మాన ప్రకాష్‌రావు, కోటి రాంబాబు, ఐఎన్‌సీ ఈ యూనియన్ మాజీ అధ్యక్షుడు బి.భోగేశ్వరరావు రక్తదానం చేసిన ఉద్యోగ, కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఫస్ట్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది, యూనియన్ నేతలు జి.అరుణ్‌కుమార్, రాజేష్, ఎడ్ల రాజేష్, ఎస్వీ రమణ, జి.ఎ.స్వామి, కోడి మురళీకృష్ణ, అప్పలరాజు, బత్తుల విజయకుమార్, గంట అంబేడ్కర్, జి.సుదర్శన్‌రావు, రాజా, సుదీశ్వరరావు, సన్నీ, బి.జగదీష్, రాజశేఖర్, బి.శంకర్ పాల్గొన్నారు.

ముగిసిన చందనం అరగదీత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత శనివారంతో పూర్తయింది. ఈనెల 30న చందనోత్సవాన్ని పురస్కరించుకుని స్వామికి సమర్పించాల్సిన మూడు మణుగుల(సుమారు 125 కిలోలు) పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈనెల 24వ తేదీ నుంచి అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా మూడు రోజుల్లోనే అరగదీతను సిబ్బంది పూర్తిచేశారు. కావాల్సిన సుమారు 125 కిలోల పచ్చి చందనాన్ని సిద్ధం చేశారు.

విపత్తుల సమయంలో రెస్క్యూపై మాక్ డ్రిల్

అగనంపూడి: పరిశ్రమల్లో అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు, రసాయన ప్రమాదాలు, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ సంస్థ మాక్ డ్రిల్ నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పించింది. ప్రమాదాల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఎలా అప్రమత్తం చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సినర్జీస్ సంస్థ డీజీఎం భాగ్యరత్నం మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్, అగ్నిప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తుంటాయన్నారు. ఇలాంటి సమయంలో చేయాల్సిన రెస్క్యూపై సిబ్బంది అప్రమత్త చేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఫణీంద్ర, ఎల్లాజీరావు పాల్గొన్నారు.

కోర్టుల సముదాయంలో వసతులపై ఆరా



గాజువాక న్యాయమూర్తులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు

గాజువాక: విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు శనివారం గాజువాక కోర్టు సముదాయాన్ని సందర్శించారు. కోర్టు భవనాల స్థితిగతులను పరిశీలించారు. అదనపు సౌకర్యాల కోసం ఆర్ అండ్ బీ అధికారులకు నివేదిక పంపించాలని సూచించారు. న్యాయమూర్తులు జి.షణ్ముఖరావు, కె.కవిత, ఎం.బి.శేషమ్మ, యార్లగడ్డ శ్రీలక్ష్మి, విపల్లవి, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యశోధర వేదమణి, డి.చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీల విజేత ఒడిశా



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న టీసీఆర్‌టీఎం ఈడీ రాణి మండా

కొమ్మాది : బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా దేశ వ్యాప్తంగా జరుగుతున్న జన జాతీయ గౌరవ్ వర్ష కార్యక్రమంలో భాగంగా జన జాతీయ ఖేల్ మహోత్సవ్-ట్రైబల్ అర్చరీ మీట్ శనివారం గీతం కళాశాల ప్రాంగణంలో ఘనంగా ముగిశాయి. రెండో రోజు ఆర్చరీ మీట్‌ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి శంకర్రావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన టీసీఆర్‌టీఎం బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆర్చరీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ, అండమాన్ నికోబార్‌లతో పాటు రాష్ట్రంలోని 8 ఐటీడీఏల నుంచి సీనియర్, జూనియర్ స్థాయిలో గిరిజన క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీల్లో ఒడిశాఖ మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, రెండో స్థానాన్ని తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. విజేతలకు టీసీఆర్‌టీఎం ఈడీ రాణిమండా సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు.